క్లుప్తంగా

సీఎం వైఎస్ జగన్ పాలనలో అన్ని వర్గాలకు మేలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. ఆంజనేయవాగులోని ఇండియా పెంతేకోస్తే దేవుని సంఘం ఆవరణలో జరిగిన ప్రార్థనల్లో షేక్ ఆసిఫ్ స్థానిక కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం నిర్వాహకులు ఆసిఫ్‌ను, రాజేష్‌లను సత్కరించారు. అనంతరం షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో కులమతాలకు అతీతంగా ప్రజలకు సుపరిపాలన అందుతుందన్నారు. విద్యా, వైద్యం, పరిపాలన రంగాల్లో సీఎం వైఎస్ జగన్ తీసుకొచ్చిన సంస్కరణలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అత్తులూరి పెద్దబాబు, గౌరి, ఉండేల శ్రీనివాసరెడ్డి, శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగర వాసులకు సంక్రాంతి శుభాకాంక్షలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరవాసులందరూ భోగభాగ్యాలతో అందరూ సౌభాగ్యంగా ఉండాలని నగరపాలకసంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో నగర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంస్కృతీ సంప్రదాయాలకు పుట్టినిల్లుగా పేరుగాంచిన సంక్రాంతి పండుగని, సంక్రాంతి పర్వదినాన, హరిదాసుల భక్తి తత్వమైన స్వరాగాలతో, బసవన్నల ఆటలతో, గొబ్బెమ్మలతో రంగురంగుల రంగవల్లికలు ప్రకృతి శోభాయామానంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

నేడు వీఎంసీ 'స్పందన' రద్దు

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలకు పరిష్కార వేదికగా వీఎంసీ ప్రధాన కార్యాలయంలో, సర్కిల్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సోమవారం సెలవు కావడంతో రద్దు చేస్తున్నామని తెలిపారు. నగర వాసులు గమనించాలని కోరారు.

చలనచిత్ర పరిశ్రమపై శోభన్‌బాబుది చెరగని ముద్ర



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నటభూషణ్ శోభన్‌బాబు 88వ జయంతిని శోభన్ సిండికేట్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏలూరు లాకుల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సిండికేట్ అధ్యక్షుడు కళ్లేపల్లి మధుసూదనరాజు, ప్రధాన కార్యదర్శి దారా సత్యం శోభన్‌బాబు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర శోభన్ సిండికేట్ అధ్యక్షుడు డాక్టర్ కళ్ళేపల్లి మధుసూదనరాజు మాట్లాడుతూ శోభన్‌బాబు మరణించి 16 ఏళ్లు గడిచినా నేటికీ ఆయన మన మధ్యనే ఉన్నాడన్న భావన కలుగుతోందని పేర్కొన్నారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమపై చెరగని ముద్రవేశారని కొనియాడారు. నటనలో తన కంటూ ప్రత్యేక శైలిని ప్రదర్శించి అశేష అభిమానులను తన సొంతం చేసుకున్నారని చెప్పారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ ధారా సత్యం మాట్లాడుతూ శోభన్‌బాబు నేటితరం నటులందరికీ ఆదర్శప్రాయుడన్నారు. ఆయన జీవిత విశేషాలను వివరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన సలహాదారు రేమాల రామకృష్ణ, కన్వీనర్ బి. ఆంజనేయులు, వైస్ ప్రెసిడెంట్ కె.జగన్మోహన్, సహాయ కార్యదర్శి వెంకట్, సలహాదారులు కేవీ సుబ్బరాజు, రామకృష్ణ, పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవలను వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ అన్నారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్‌సూ్కల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం ఆరోగ్య అగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ట్రస్ట్ సేవలను వివరించారు. వయోవృద్ధులు ఆరోగ్యకర జీవనం సాగించటానికి గానూ తాము ప్రముఖ ఆయుర్వేద, అల్లోపతి, హోమియో వైద్య నిపుణులచే ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ ఏపీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్యనిపుణులు డాక్టర్ కోనా వీరబ్రహ్మం పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో సంక్రాంతి సంబరాలు

- భోగితో వేడుకలు ప్రారంభం
- ఇంటింటా వెల్లివిరిసిన ఆనందోత్సాహాలు
- నగరంలో పండుగ వాతావరణం



వెలంపల్లి ఇంటి వద్ద సంక్రాంతి సంబరాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో సంక్రాంతి వేడుకలు ఆదివారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం తెల్లవారు జామునే వాడవాడలా ప్రజలు భోగి మంటలు వేసి వేడుకలను ప్రారంభించారు. సుదూర ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులు, బంధువులు నగరంలోని తమ ఇళ్లకు చేరుకోవడంతో అందరూ ఆనందోత్సాహాలతో వేడుకలను జరుపుకున్నారు. దీంతో నగరంలో పండుగ వాతావరణం నెలకొంది. అదేవిధంగా ఆలయాల వద్ద భోగి మంటలను వేసి పూజలు నిర్వహించారు. స్థానిక శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు ఇంటి వద్ద సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున భోగి మంటలను వెలిగించి వేడుకలను ప్రారంభించారు. అలాగే గంగిరెద్దుల విన్యాసాలు, కోడి పందెళ్లతో సందడి చేశారు. అదేవిధంగా భావనారాయణ వీధిలో స్థానిక కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. అందులో భాగంగా భోగి మంటలు వేశారు. గంగిరెద్దులతో విన్యాసాలు చేయించారు. కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ స్టేట్ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు, నాయకులు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబా మందిరంలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): సంక్రాంతి పర్వదినాల్లో భాగంగా భోగి పండుగను పురస్కరించుకుని భవానీపురం హౌసింగ్ బోర్డ్ కాలనీలోగల సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన వేడుకలు వైభవంగా జరిగాయి. సాయిబాబా విగ్రహంపై భక్తులతో భోగి పండ్లు పోయించిన అనంతరం వాటిని చిన్నారులపై పోసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మందిరం పాలకమండలి అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు భోగి పండుగ విశిష్టతను పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో పాలకమండలి ఉపాధ్యక్షుడు మోటుమర్రి సుబ్బారావు, కోశాధికారి చందలూరి రాజశేఖర్, జాయింట్ సెక్రటరీ పెండేల వెంకట లక్ష్మీ ప్రసాద్, సెక్రటరీ గుడివాడ విజయకుమార్, సభ్యులు యెనిగళ్ల సుబ్బారావు, సాయి సేవకులు పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాల్లో పార్టీ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్, కార్పొరేటర్లు



సాయిబాబా విగ్రహం వద్ద పాలకమండలి సభ్యులు, భక్తులు

కనులపండువగా గోదాదేవి కల్యాణోత్సవాలు



గోదాదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కల్యాణోత్సవంలో అర్చకులు, కమిటీ సభ్యులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా వన్‌టౌన్‌లోని పలు ఆలయాల్లో ఆదివారం గోదాదేవి రంగనాయకస్వామి వార్ల కల్యాణోత్సవాన్ని అత్యంత కనులపండువగా నిర్వహించారు. భోగి పండుగను పురస్కరించుకొని పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వైష్ణవులు పరమ పవిత్రంగా భావించే ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అలాగే ఆలయాలను ముస్తాబు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ధనుర్మాసంలో అత్యంత విశేషమైన రోజుగా భావించే భోగి సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అలాగే స్వామి వారి నగరోత్సవాలను చేపట్టారు.

గీతా మందిరంలో గోదా కల్యాణం

పాతబస్తీ ఇస్లాంపేటలోని గీతామందిరంలో గోదాదేవి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. మందిరంలో శ్రీకృష్ణార్జున మూలమూర్తులకు విశేష వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే మధ్యాహ్నం స్వామి వారి కల్యాణోత్సవాన్ని జరిపారు. శాంతి సత్సంగ మండలి అధ్యక్షుడు జమిలి పురుషోత్తమరావు, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు, న్యాయవాదులు నరహరిశెట్టి రామచంద్రరావు, నరహరిశెట్టి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నగరోత్సవం

వన్‌టౌన్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని సాయంత్రం గోదాదేవి రంగనాయకుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అందులో భాగంగా ఉదయం అమ్మవారి నగరోత్సవాన్ని చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. వైదిక కార్యక్రమాలను పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి నిర్వహించారు.



విశేష అలంకారంలో స్వామి అమ్మ వార్లు



గోదాదేవి పాండురంగ స్వామి

కోదండరాముని సన్నిధిలో కల్యాణం

పాతబస్తీ శేషయ్యవీధిలోని కొత్తగుళ్ల ప్రాంగణంలో ఉన్న కోదండరాముని సన్నిధిలో సాయంత్రం గోదాదేవి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని కోదండరాముని మూలమూర్తులకు విశేష అలంకారం చేశారు. ఉదయం ఆలయంలోని పాండురంగని ఉపాలయంలో గోదాదేవి సమేత పాండురంగని కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కొత్తపేట శ్రీ నగరాల సీతారామస్వామి వార్ల దేవస్థానం, సైకం వారివీధిలోని శ్రీ సీతారామస్వామి వార్ల దేవస్థానం , భావనారాయణవీధిలోని కోదండరామస్వామి వారి దేవస్థానం తదితర ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచి బారులు తీరారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

చిట్టినగర్‌లో..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం గోదా కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో నిర్వహించిన గోదా కల్యాణానికి పెద్ద ఎత్తున ఉభయదాతలు తరలివచ్చారు. ఆలయ అర్చకులు, దేవస్థాన కమిటీ సభ్యులు స్వామి వారు, దేవేరుల తరుపున కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. పలువురు చిన్నారులు గోదా, కృష్ణ వేషధారణలో కల్యాణానికి విచ్చేయగా, కల్యాణ వేదిక గోకులాన్ని తలపించింది. అనంతరం చిన్నారులకు అర్చకులు భోగి పండ్లు పోశారు. గోదా కల్యాణ విశిష్టతను భక్తులకు వివరించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు లింగపల్లి అప్పారావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, ఇతర కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అంగరంగ వైభవంగా వేడుకలు



ఇంద్రకీలాద్రిపై అమ్మ వారిని దర్శించుకుంటున్న భక్తులు



ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు

ఇంద్రకీలాద్రిపై సంక్రాంతి కోలాహలం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో సంక్రాంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన భోగి మంటలను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈవో కేఎస్ రామారావులతో పాటు ఆలయ అధికారులు, అర్చకులు, పాలక మండలి సభ్యులు వెలిగించారు. తొలుత భోగి మంట వద్ద ఆలయ చైర్మన్, ఈవోలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం రాజగోపురం ఎదుట ఏర్పాటు చేసిన గంగిరెద్దులకు పూజలు నిర్వహించి దాణా అందజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది అమ్మవారి ఆలయంలో సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. పల్లె వాతావరణాన్ని తలపించేలా పూరిపాకలు, గంగిరెద్దులు, హరిదాసులు, మట్టి పాత్రల తయారీ, పందెం కోళ్ల గూళ్లు, మేళతాళాలతో తెలుగు వారి సంప్రదాయం ఉట్టి పడింది. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పల్లె వాతావరణాన్ని చూసి ముగ్ధులయ్యారు. చిన్నారులు, పెద్దలు సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహం చూపారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఈఈలు కోటేశ్వరరావు, రమాదేవి, ఆలయ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు. అమ్మవారి ఆలయంతో పాటు చిన్న గాలి గోపురం, ప్రధాన ఆలయం ద్వారం వద్ద పూలతో చేసిన అలంకరణ అందరిని ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని అరటి చెట్లు, మామిడి తోరణాలతో అలంకరించారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

రాజగోపురం ఎదుట కళావేదిక వద్ద దేవస్థానం ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంది. వివిధ దేవతా మూర్తుల విగ్రహాలు, కొండపల్లి బొమ్మలతో పాటు పల్లె వాతావరణాన్ని తలపించే బొమ్మలు అందరిని ఆకట్టుకున్నాయి. బొమ్మల కొలువును చైర్మన్, ఈవోలు ఆవిష్కరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం బొమ్మల కొలువు వద్ద చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు.

భక్తులతో క్యూలైన్లు రద్దీ

అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులతో ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు రద్దీగా కనిపించాయి. తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. హైదరాబాద్, తెలంగాణాలోని పలు ప్రాంతాలతో పాటు బెంగళూరు, ముంబాయి, పూనే నుంచి పండుగను స్వస్థలాలకు బయలుదేరిన వారు అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తుల రద్దీతో క్యూలైన్లు కిటకిటలాడాయి.

సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- పశ్చిమంలో గెలిచి జగనన్నకు గిఫ్ట్‌గా అందిస్తా
- వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్



ఆసిఫ్, మధులను సత్కరిస్తున్న ఆకుల శ్రీనివాస్ కుమార్, నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): తనపై నమ్మకంతో పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడ పార్టీని గెలిపించి సీఎంకు గిఫ్ట్‌గా అందిస్తానని షేక్ ఆసిఫ్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు ఆకుల శ్రీనివాస్ కుమార్ భవానీపురంలోని తన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పశ్చిమ నియోజకవర్గం తనకు కొత్త కాదని, గతంలో గడప గడపకు తిరిగినప్పుడు అందరితో అనుబంధం ఏర్పడిందని తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో మమేకమై పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. కార్పొరేటర్ స్థాయి నుంచి మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా, ఇప్పుడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎదిగానంటే సీఎం వైఎస్ జగనన్న మైనార్టీలకు ఇచ్చిన ప్రోత్సాహమే అందుకు కారణమన్నారు. మహానేత వైఎస్సార్ తరువాత మైనార్టీ సామాజికవర్గానికి అంతకంటే ఎక్కువ మేలు చేసిన మనసున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో మైనార్టీలను అణగతొక్కారని, చంద్రబాబు మంత్రివర్గంలో మైనార్టీలకు మంత్రి పదవి ఇవ్వకపోవడమే అందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి సామాజిక న్యాయం పాటించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు..

సమావేశం నిర్వాహకులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు ఆకుల శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడినవారికి ఏదో ఒక రోజు తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని, అందుకు ఆసిఫ్ నిదర్శనమన్నారు. తన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా ప్రజల కష్టసుఖాలు తెలుసుకుని, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని తీర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని తెలిపారు. జెండా, ఎజెండా కలిగిన ఏకైక పార్టీ జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ మాత్రమేనన్నారు. ఈ సందర్భంగా ఆకుల ఆసిఫ్‌ను ఘనంగా సత్కరించారు. అలాగే ఇటీవల వన్‌టౌన్ పాత శివాలయం చైర్మన్‌గా నియమితులైన బొమ్ము మధును సత్కరించారు. సమావేశంలో కార్పొరేటర్ యలకల చలపతిరావు, పార్టీ నాయకులు పొదిలి చంటిబాబు, ఏలూరు వెంకన్న, అల్లం పూర్ణ, యరజర్ల మురళి, రాచమళ్ల సుధాకర్(సబ్బుల్స్), ఎం.వెంగళరెడ్డి, సూరసాని రామిరెడ్డి, అడ్వకేట్ కరిముల్లా, లక్కు నాగిరెడ్డి, కె.లక్ష్మిరెడ్డి, సీహెచ్ సుబ్బారెడ్డి, లేళ్లపూడి లాజర్, రుద్ర శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రతి ఒక్కరూ తరలి రావాలని పలువురు వక్తలు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదేశాల మేరకు 32వ డివిజన్ బసవతారకనగర్‌లో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ అధ్యక్షుడు పొలిమెట్ల శరత్ బాబు డివిజన్ ఎస్సీ నాయకులు యాకోబు, రాబర్ట్, లక్ష్మణ, బత్తుల సుబ్బారావు, మేకతోటి రవి, బాలా, డేవిడ్, పేరం త్రివేణి, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పారిశుద్ధ్య కార్మికులకు అండగా ప్రభుత్వం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని పారిశుద్ధ్య కార్మికులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. 37వ డివిజన్ కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆసిఫ్ వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అట్టడుగు వర్గాలకు ప్రభుత్వం అండగా నిలిచి వారికి చేయూతనందిస్తుందన్నారు. నగరపాలకసంస్థ ఇటీవల జాతీయ స్థాయిలో పలు బహుమతులను సాధించి విజయవాడ కీర్తిని ఇనుమడింపజేసిందని చెప్పారు. అందులో పారిశుద్ధ్య కార్మికుల భాగస్వామ్యం సైతం ఉందని, వారిని అభినందించారు. కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించటం అభినందనీయమన్నారు. అదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి, కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు, నాయకులు మండల శ్రీను, జిలానీ, పైడాడ శ్రీనివాసరావు, బుజ్జి పాల్గొన్నారు.



వస్త్రాలు అందజేస్తున్న షేక్ ఆసిఫ్, కార్పొరేటర్ ఛటర్జీ

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడ రూరల్): విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద టిఫిన్ బండి వద్ద పని కోసం వెళ్లిన యోడి వాసు నాయక్ కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వాంబేకాలనీకి చెందిన యోడి వాసు నాయక్ ఈ నెల 11వ తేదీన పనికి వెళ్లిన ఆయన ఇంటికి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద విచారించిగా ఆచూకీ లేకపోవడంతో ఆయన భార్య అమావాస్య చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికులకు చీరల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): తోటి వారికి సాయం చేయటం అలవాటుగా చేసుకోవాలని వాకర్స్ క్లబ్ జిల్లా గవర్నర్ చిన్నం రామకృష్ణ కోరారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా దుర్గాపురంలో ఆదివారం బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. బీఆర్‌టీఎస్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు బ్రహ్మాదేశం వసంతకుమార్ మాట్లాడుతూ నగరాన్ని శుభ్రంగా ఉంచటానికి అహర్నిశలు శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు తమ వంతు బాధ్యతగా చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు. రాబోయే రోజులలో క్లబ్‌సభ్యుల సహకారంతో సేవలు మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. బి.గాంధీ, మురళీకృష్ణ బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, పసుపులేటి రమేష్, నాగ మల్లిక, షఫీ, గోకర్ణేశ్వరరావు పాల్గొన్నారు.